

ప్రాణాలు తీస్తున్న ఆర్టీసీ

కొందరి డ్రైవర్ల నిర్లక్ష్యంతో బస్సులు ప్రజల నిండు ప్రాణాలు బలితీసుకుంటున్నాయి.

వివరాలు 8లో ▸



ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేనా?

మదనాపురం రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌లు ఆగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.1 /19.6

వాతావరణం

రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత తప్పదు. అర్ధరాత్రి తర్వాత చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పల్లి రైతుల రాస్తారోకో

నారాయణపేట రూరల్: గిట్టుబాటు **ధర కోసం** శుక్రవారం రైతులు రోడ్డెక్కారు. **పట్టణంలోని** స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు **అన్నదాతలు** వేరుశనగ బస్తాలు తీసుకొచ్చారు. **అయితే ధర** రూ.4,000 నుంచి రూ.7,200 వర**కు ఉండటం**తో రైతులు అమ్మడానికి ఇష్టపడలే**దు. వ్యాపా**రులు కుమ్మక్కై గిట్టుబాటు ధర రాకుండా చేస్తున్నారని ఆరోపిస్తూ.. మార్కెట్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ అధికారుల నుంచి సరియైన స్పందన రాకపోవడంతో రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. గంట పాటు రాస్తారోకో చేయడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన



కోస్గి: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఇంజినీర్లతో పాటు ఉద్యోగులందరి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం స్థానిక విద్యుత్ ఏడీ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వేతన సవరణతో పాటు ఈపీఎఫ్ టూ జీపీఎఫ్ మరియు పర్సనల్ పే బేసిక్ కలపాలనే డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీ ఉద్యమాలు చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. విద్యుత్ ఏడీ కార్యాలయం ఎదుట సబ్‌డివిజన్ ఏడీ సుధారాణి ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఇందులో విద్యుత్ ఉద్యోగులు మహమూద్, అరుణ్ కుమార్, వెంకటేష్, రాజేష్, విజయ్, మల్కప్ప, శ్రీను, సంజీవ్ పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



నారాయణపేట రూరల్: అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీలకు శుక్రవారం జిల్లా జట్టు సభ్యులు తరలివెళ్లారు. ఈ నెల 25, 26 తేదీల్లో హన్మకొండ వేదికగా జరిగే అండర్ 14, 16, 18, 20 స్త్రీ, పురుష విభాగాల్లో రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు వారికి జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి రమణ, కోచ్ భరత్‌రాజు అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లా పేరు తీసుకుని రావాలని కోరారు.

సమస్యలపై నిర్లక్ష్యం తగదు

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంతో పాటు మద్దూర్ మండలంలో పర్యటించి పాఠశాలలు, పలువురు ఉపాధ్యాయుల ఇంటికి వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు రాజకీయ రంగు పులిమి టీచర్లను మభ్యపెట్టడం సరికాదన్నారు. మండలిలో ప్రభుత్వంపై గొంతు ఎత్తుతామని, టీచర్లకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. భాషాపండితులు, పీఈటీలకు న్యాయం చేసి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, 317జీఓ బాధిత టీచర్లకు తగిన పరిష్కారం చూయించాలని డిమాండ్ చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటును ప్రొఫెసర్ వినయ్‌బాబుకు వేసి గెలిపించాలని కోరారు. దేవేంద్రప్ప, రెడ్డప్ప, భరత్, దశరథ్, గోపాల్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

నారాయణపేట రూరల్: పెండింగ్‌లోని ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయమని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కొల్లంపల్లి పాఠశాలలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యావ్యవస్థ నిర్వీర్యం అవుతుందని, టీచర్ల సమస్యలు పరిష్కారం కావడంలేదని వాపోయారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నర్సింహా, చిన్ననర్సింహులు, శ్రీనివాస్, శ్రీహరి, రవికుమార్, బాలరాజు, కవిత, గౌస్ పాల్గొన్నారు.

అనుమతులు ఏవీ?

- ఇష్టారాజ్యంగా వెలుస్తున్న ఇటుక బట్టీలు
- చెరువుల నుంచి యథేచ్ఛగా మట్టి తరలింపు
- విద్యుత్ దుర్వినియోగం, వాల్టా చట్టం ఉల్లంఘన
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



నారాయణపేట పట్టణ శివారులోని ఇటుక బట్టీ

నారాయణపేట రూరల్: నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలను నిర్వహిస్తూ.. రూ.కోట్లు కూడబెట్టుకుంటున్నారు. తూతూమంత్రంగా అనుమతులు కొందరు పొందినా.. చాలా వరకు జిల్లాలో అక్రమంగా బట్టీలు వెలిశాయి. రెవెన్యూ, ఫారెస్టు, మైనింగ్, విద్యుత్, కార్మిక శాఖలు సమన్వయం లేకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. వారు చేస్తున్న వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలు అనే చందంగా సాగుతుంది. ఇతర ప్రాంతాల నుంచి కూలీలుగా తీసుకుని వచ్చిన వారికి సరైన సౌకర్యాలు కల్పించకపోగా.. వారి పిల్లల జీవితాల్లో చదువులేక చీకటిమయంగా మారిపోతుంది.

వాల్టా, కార్మిక చట్టాలకు తూట్లు ..

ఇటుక బట్టీల ఏర్పాటుకు కనీసం 2 నుంచి 5 ఎకరాల భూమి అవసరం. ఆయా పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్‌తో పాటు రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతి పొందాలి. అదేవిధంగా కాలుష్య నియంత్రణ అధికారి నుంచి అనుమతి పత్రం తీసుకోవాల్సి ఉంటుంది. ఎంత మంది కూలీలు పనిచేస్తున్నారో వారి వివరాలను కార్మిక శాఖకు తెలియజేయాల్సి ఉంది. లేబర్ కాంట్రాక్ట్ లైసెన్స్‌తో పాటు పట్టాదారు పాసుపుస్తకం, లీజు అగ్రిమెంట్ పొంది మైనింగ్ శాఖకు దరఖాస్తు చేసుకోవాలి. వ్యవసాయ భూముల్లో పెడితే ముందు నాలా పన్ను కట్టి, వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాల్సి ఉంటుంది. అటవీ ప్రాంతాలకు సమీపంలో అసలు ఏర్పాటు చేయరాదనే నిబంధన ఉంది. ఇటుకల తయారీకి మట్టిని ఎక్కడి నుంచి తెస్తారో ముందుగానే అనుమతి పొందాలి. ఇతర ప్రాంతాల నుంచి తరలిస్తే నీటిపారుదల శాఖ అనుమతి తీసుకుని సీనరేజ్ చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే వీటిలో ఏ ఒక్కటి పాటించకుండానే వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ ప్రభుత్వ స్థలాలు, వ్యవసాయ భూములు, అటవీ ప్రాంతాల సమీపంలో ఇటుక బట్టీలను యథేచ్ఛగా నడుపుతున్నారు.

విద్యుత్ దుర్వినియోగం..

ఇటుక బట్టీలకు ప్రత్యేక విద్యుత్ కనెక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. బోరుమోటార్, రాత్రి వేళలో లైట్ల ఏర్పాటుకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. అందుకు మీటరు పెట్టుకుని క్యాటగిరి 2లో సింగల్ ఫేజ్ కనెక్షన్ తీసుకోవాలి. ప్రతినెల బిల్లు కట్టాలి. అయితే బోరు కోసం సింగల్ ఫేజ్ మోటార్ ఉండాల్సి ఉండగా.. తీ్రఫేజ్ మోటార్‌తో నీళ్లు తోడుకుంటున్నారు. చాలా మంది సమీప పొలాల బోర్లను లీజుకు తీసుకుని వాటిని వాడుతున్నారు.



బొగ్గును కాల్చి నిల్వ చేసిన బూడిద

పుట్టగొడుగుల్లా.. బట్టీలు..

జిల్లాలో ఇటుక బట్టీలు వెలుస్తూనే ఉన్నాయి. చెరువులు, గుట్టల నుంచి మట్టి తరలిస్తుంటే అడిగే వారు కరువయ్యారు. జిల్లాలో దాదాపు 150కి పైగా ఇటుక బట్టీలు ఉండగా.. అందులో 30 వరకు నామమాత్రపు అనుమతులు ఉన్నాయి. ఇక మిగిలిన వాటికి ఎలాంటి అనుమతులు లేకపోయినా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇక నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేసిన బట్టీలతో రోడ్డుపై వెళ్లే వాహనదారులకు పొగ, దూళితో ఇబ్బందులు పడుతున్నారు.

అక్రమంగా తరలింపు..

ఇటుక బట్టీలను ఏర్పాటు చేసిన ప్రాంతాలకు సమీపంలోని చెరువులు, గుట్టల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. పెద్ద ఎత్తున చెరువుల్లో గుంతలు తవ్వుతుండటంతో నీరు వచ్చిన తర్వాత ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. అదేవిధంగా గుట్టల వద్ద పెద్ద ఎత్తున మట్టిని తోడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అనుమతి పొందిన చోట సైతం మట్టి తవ్వకాలకు మనుషులను వాడాలనే నిబంధన ఉన్నా.. పెద్ద పెద్ద యంత్రాలను వినియోగిస్తున్నారు. ఇక మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్లలో లోడ్ చేసి రాత్రి వేళలో తరలిస్తున్నారు.

రైతుబంధు రాకుండా...

ఇటుక బట్టీలు వ్యవసాయ భూమిలో పెట్టుకోవడం చట్ట విరుద్ధం. చాలా వరకు నాలా మార్పు చేసి వ్యవసాయేతర భూమిగా మార్పు చేసి బట్టీలు పెట్టుకునేలా చర్యలు చేపడుతున్నాం. బట్టీలు నిర్వహిస్తున్న స్థలాలకు సంబంధించి రైతుబంధు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. – దానయ్య, రెవెన్యూ అధికారి, నారాయణపేట

మా దృష్టికి రాలేదు..

చెరువుల్లో నీరు ఉండటంతో ఒండ్రుమట్టి తవ్వడం లేదు. అక్కడక్కడ ఏమైన జరిగితే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు అలాంటివి మా దృష్టికి రాలేదని, ఇకముందు పరిశీలిస్తాం. – ఖలీద్, ఇరిగేషన్ ఏఈ

నేరుగా దాడులు చేస్తాం..

కట్టెల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. సిబ్బంది కొరతతో దాడుల నిర్వహణ తక్కువగా ఉంది. ఇకముందు బట్టీలపై నేరుగా దాడులు చేసి కేసులు నమోదు చేస్తాం. – శ్రీనివాస్, ఫారెస్ట్ అధికారి

కేసులు నమోదు చేశాం...

అన్ని చోట్ల ఇటుక బట్టీల నిర్వాహకులకు అవగాహన కల్పించి మీటర్లు పెట్టిస్తున్నాం. విజిలెన్స్ దాడుల్లో మూడు చోట్ల కేసులు నమోదు చేశాం. భవిష్యత్‌లో మరిన్ని దాడులు చేస్తాం. అక్రమ కనెక్షన్లు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం. – రఫీ, విద్యుత్‌శాఖ అధికారి



ఇటుక అచ్చు వేస్తున్న కూలీలు

కూలీలతో గొడ్డు చాకిరి..

ఇటుక బట్టీల్లో పనిచేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకుని వస్తున్నారు. వారికి సరియైన సౌకర్యాలు సైతం కల్పించకపోగా, వారి నుంచి గొడ్డు చాకిరి చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కార్మిక చట్టం ప్రకారం రోజువారి పని వేళలు 8 గంటలు ఉండగా.. అందుకు భిన్నంగా రాత్రి పగలు అనే తేడా లేకుండా పనులు చేయిస్తున్నారు. వారితో పాటు వచ్చిన పిల్లలను సైతం పనికి వాడుతున్నారు. ఏటా పోలీసుశాఖ నిర్వహిస్తున్న ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ దాడుల్లో పెద్ద ఎత్తున బాల కార్మికులు పట్టుకున్నారు. గడిచిన మూడేళ్లలో 70 మంది చిన్నారులను గుర్తించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఎన్ని మార్లు పట్టుబడినా స్థానిక నేతలు వారిని విడిపిస్తున్నారే తప్పా.. ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

- జూనియర్ సివిల్ జడ్జి పర్వీన్‌బేగం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి పర్వీన్‌బేగం

నారాయణపేట రూరల్: సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను చైతన్యపర్చాలని జూనియర్ సివిల్ జడ్జి పర్వీన్‌బేగం అన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. డిజిటల్ రంగంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ముఖ్యంగా అమ్మాయిలు చిన్న నిర్లక్ష్యంతో మోసగాళ్ల చేతిలో మోసపోతున్నారన్నారు. లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకునేలా ప్రచారం చేయాలన్నారు. సెల్‌ఫోన్ వాడకంతో అనేక సమస్యలు వస్తున్నాయని, యూ ట్యూబ్ వీడియోల వీక్షణతో పిల్లలు చెడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళా చట్టాలపై తెలియజేయాలన్నారు. పాఠశాల, కళాశాలల్లో బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. యువత నేర మార్గం వైపు పయనించకుండా చూడాలన్నారు. ఏజీపీ సతీష్‌గౌడ్, న్యాయవాదులు సలీం, మల్లికార్జున్, హన్మంతు, సీతారాం, నారాయణ, నర్సింహులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలను అరికట్టాలి



పత్తి మిల్లు నిర్వాహకులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

దామరగిద్ద: మండలంలోని ఉల్లిగుండం శివారులోని గణేష్ కాటన్‌మిల్లులో తూకాల్లో జరుగుతున్న మోసాలను అరికట్టాలని తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు అంజిలయ్యగౌడ్, గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం సదరు మిల్లును సందర్శించి తూకాల్లో మోసాలపై ఆరా తీశారు. కర్ణాటక రాష్ట్రం కానగడ్డకు చెందిన నలుగురు భీంరెడ్డి, తిమ్మప్ప, మరో ఇద్దరు రైతులు మొత్తం 48 క్వింటాళ్ల పత్తిని బొలెరో వాహనంతో ఇంటి వద్ద తూకం చేసి తీసుకురాగా.. వే బ్రిడ్జ్ తూకంలో 32 క్వింటాళ్లు రావడంతో రైతులు కంగుతిన్నారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో విషయం తెలుసుకుని మిల్లుల్లో జరుగుతున్న మోసాలపై ఆరా తీశామన్నారు. జిల్లాలోని పత్తి కొనుగోలు మిల్లుల వద్ద ఉన్న వేబ్రిడ్జ్‌లపై అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో మోసాలకు హద్దు లేకుండా పోయిందన్నారు. అధికారులు వెంటనే మిల్లులో జరుగుతున్న మోసాలను గుర్తించాలన్నారు. ప్రతి 10 క్వింటాళ్ల పత్తికి 3 క్వింటాళ్ల తేడాతో మోసం చేసినట్లు తెలుస్తుందన్నారు. ఇంతవరకు కొనుగోలు చేసిన పత్తి వివరాలు, గతంలో కొనుగోలు చేసిన పత్తి రైతుల వివరాలను విచారణ జరిపి మోసపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మహేష్ కుమార్‌గౌడ్, ఎస్‌ఎఫ్‌ఐ మోహన్ రైతులు పాల్గొన్నారు.

ముగిసిన ఫిజికల్ ట్రెయినింగ్

నారాయణపేట రూరల్: వారియర్స్ డిఫెన్స్ అకాడమి ఆధ్వర్యంలో పట్టణంలో ఆరు నెలలుగా స్థానిక కృష్ణగోకులం స్కూల్‌లో నిర్వహిస్తున్న ఉచిత ఫిజికల్ ట్రెనింగ్ శుక్రవారం ముగిసింది. డైరెక్టర్, ఆర్మిజవాన్ ఆంజనేయులు మాట్లాడారు. దాదాపు 120 మందికి శిక్షణ ఇవ్వగా.. 74 మంది క్వాలిఫై అయ్యారని చెప్పారు. వీరికి ఉచితంగా మెటీరియల్ అందించామన్నారు. అలాగే ఉచితంగా మెడికల్ చెకప్ చేయించామని, కంటి, డెంటల్, జనరల్ చెకప్ జరిగాయన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందులు తాపించాలి

- జే.డీ శ్రీనివాస్‌రావు



మరికల్: సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా జీవాలకు నట్టల నివారణ మందులు తాపించాలని జేడీ శ్రీనివాస్‌రావు అన్నారు. మరికల్‌లో శుక్రవారం ఆయన గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి జీవాలకు నట్టల నివారణ మందులు తాపించాలని సూచించారు. కాపరులు కూడా తమ జీవాలకు వచ్చిన సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు పశువైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మహాదేవ్, సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్, చిన్నరాయుడు, భరత్, వాసుదేవ్ పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమస్యలపై ‘సాక్షి’ ఫోన్ ఇన్

నారాయణపేట పట్టణ ప్రజలు ఫోన్ చేయాల్సిన నంబర్: 9618090288

సమయం: శనివారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు

నారాయణపేట, కోస్గి మున్సిపాలిటీలలో ప్రజలు **ఎదుర్కొంటు**న్న సమస్యలపై నేడు ‘సాక్షి’ ఆధ్వ**ర్యంలో** ఫోన్ ఇన్ కార్యక్రమం ఉంటుంది. **నారాయణ**పేట మున్సిపల్ కమిషనర్ సునీత, అలాగే కోస్గి మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ రావు పాల్గొంటారు. కుక్కలు, కోతుల బెడద, తాగు నీటిఎద్దడి, పారిశుద్ధ్య లోపం, వెలగని వీధిలైట్లు తదితర సమస్యలను పుర ప్రజలు మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లవచ్చు. వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారు.



సునీత
నారాయణపేట
మున్సిపల్ కమిషనర్

కోస్గి పట్టణ ప్రజలు ఫోన్ చేయాల్సిన నంబర్: 81210 94097

పీఎం ఆవాస్ యోజన లబ్ధిదారులను గుర్తించాలి



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

- కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట రూరల్: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద మున్సిపాలిటీ ప్రాంతాల్లోని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగంగా పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంత కుమారి శుక్రవారం చేపట్టిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులను గుర్తించాలని, రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం చేయడానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఆర్డర్ చేయబడిన అద్దాలు జిల్లాకు చేరుతున్నాయని, వాటిని పీహెచ్‌సీల వారీగా పంపిణీ చేయాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ టీమ్ నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. మౌలిక సదుపాయాల విషయంలో తగిన చర్యలు చేపట్టాలన్నారు. పోడు పట్టాల విషయంలో అర్హులకు పట్టా పాసుపుస్తకాలు అందించాలన్నారు. హరితహారం విషయంలో చక్కటి ప్రణాళికతో జీపీల వారీగా నర్సరీల ద్వారా మొక్కలను పంపిణీ చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ మయంక్ మిత్తల్, హార్టికల్చర్ అధికారి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

■ ఆర్‌బీఎస్‌కే వైద్య బృందంతో శుక్రవారం కలెక్టర్ శ్రీహర్ష వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 6 నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలకు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయాలని, వారిలోని లోపాలను గుర్తించి తగిన చికిత్సకు సిఫారసు చేయాలన్నారు. జిల్లాలో ఐదు బృందాలు ఉన్నాయని, ప్రతిఒక్కరూ నిత్యం పాఠశాలలకు ఉదయం 9.30 గంటలకు చేరుకుని పరీక్షలు చేయాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అవసరమైన వైద్య చికిత్సలు చేయాలన్నారు. పుట్టుకతో లోపాలు, జన్యు సంబంధ సమస్యలు, రక్తహీనత, వ్యాధులకు సంబంధించి ఆస్పత్రికి పంపించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామ్‌మనోహర్‌రావు, డాక్టర్ శైలజ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయించాలి

ధన్వాడ: ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా వైద్యులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. 12 వారాల లోపు గర్భిణుల వివరాలను రిజిస్ట్రేషన్ తప్పకుండా చేయించాలని సూచించారు. ఆశ కార్యకర్తల సహకారంతో వంద శాతం వారి వివరాలను పూర్తి చేయాలన్నారు. 102 వాహనాన్ని గర్భిణుల ఆరోగ్య నిమిత్తం వాడుకోవాలన్నారు. ధన్వాడ పీహెచ్‌సీలో తక్కువ ప్రసవాలు జరగడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలను సద్వినియోగం చేసుకుని గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్యం అందించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఓపీ, ఆస్పత్రి సిబ్బంది రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని చేనేత కార్మికుల మగ్గాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీహెచ్‌ఓ రాంమోహన్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



మాగనూర్: మండలంలోని హిందూపూర్‌లో వెలిసిన శ్రీసద్గురు శంకరానంద సరస్వతీ స్వామి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహానికి అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకిలో రథం వద్దకు తీసుకొచ్చారు. భక్తుల జయజయ ధ్వనులు, మేళతాళాల నడుమ రథం ముందుకు కదిలింది. వివిధ పార్టీల ప్రముఖ నాయకులు రథోత్సవ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బస్టాండ్ పరిరక్షణకు చర్యలు



డిపో మేనేజర్‌తో మాట్లాడుతున్న పుర చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను పరిరక్షించేందుకు అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటామని వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ పరమేశ్వరి అన్నారు. శుక్రవారం బస్టాండ్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కమిషనర్ మహ్మద్ ఖాజా బస్టాండ్ పరిస్థితిని డీఎంకు వివరించారు. ప్రహరీ లేకపోవడంతో స్థలం ఆక్రమణకు గురవుతుందన్నారు. ఆవరణలో ఏర్పాటు చేసిన చిరు వ్యాపారుల డబ్బాల నుంచి అద్దెలు వసూలు చేయాలని సూచించారు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయని మరమ్మతులు చేయించాలన్నారు. ప్రస్తుతం గద్వాల డిపో బస్సులు మాత్రమే వస్తున్నాయని.. వనపర్తికి ఇక్కడి నుంచి ప్రయాణికులు అధికంగా వెళ్తుంటారని రెండు షటిల్ బస్సులు నడపాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కోరగా రూట్‌ను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరుగుదొడ్ల మరమ్మతులు త్వరగా చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులు తొలగిస్తామని డీఎం తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మంగ లావణ్య, ఆర్టీసీ సీఐ చంద్రమోహన్, సిబ్బంది వెంకటేష్, జీఎం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పీయూలో ‘బిజినెస్ స్ట్రాటజీ’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సిబ్బంది రచించిన బిజినెస్ పాలసీ అండ్ స్ట్రాటజీ అనే పుస్తకాన్ని వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం పీజీ చదువుతున్న విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పుస్తక రచయితలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గిరిజ, రచయితలు అర్జున్‌కుమార్, అవీద్, నాగసుధ, అరుంధతి, అధ్యాపకులు పిండి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

గట్టు: పొలానికి నీరు పారించేందుకు వెళ్లి యువ రైతు మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇందువాసికి చెందిన కొన్నింటి వెంకటేష్(30)తో పాటు తండ్రి భీమన్న గురువారం వ్యవసాయ పొలానికి వెళ్లారు. సాయంత్రం వరకు తండ్రి, కొడుకులు పొలంలో కలిసి పనిచేశారు. బోరుమోటార్ ద్వారా పంటలకు నీరు పారించారు. చీకటి పడిన తర్వాత తండ్రి భీమన్న ఇంటికి రాగా, వెంకటేష్ అర్ధరాత్రి వచ్చే త్రీఫేస్ కరెంట్ కోసం పొలం వద్దే ఉండిపోయాడు. అర్ధరాత్రి త్రీఫేస్ కరెంట్ వచ్చినప్పటికీ బోరుమోటార్ ఆన్ కాకపోవడంతో ఆన్ చేసేందుకు వైర్లు సరిచేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృత్యువాత పడ్డాడు. తెల్లవారిన తర్వాత ఇంటికి రావాల్సిన కొడుకు ఎంతకు రాక పోయే సరికి కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూశారు. పొలంలో వెంకటేష్ మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య పావని, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు..


శివరాం (ఫైల్)

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హన్వాడ మండల కేంద్రానికి చెందిన సరోజ, శ్రీనివాసులు దంపతుల కుమారుడు శివరాం(22) తన స్నేహితులతో కలిసి మహబూబ్‌నగర్‌లో గదిని అద్దెకు తీసుకుని ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి కోయిల్‌కొండలో జరుగుతున్న స్నేహితుడి వివాహానికి స్నేహితులతో కలిసి వెళ్లాడు. అనంతరం అదే రాత్రి 2.20 గంటల సమయంలో తిరిగి మహబూబ్‌నగర్‌కు ద్విచక్రవాహనంపై ఒక్కడే వెళ్తున్నాడు. మార్గమధ్యంలో కోయిల్‌కొండ హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా అతను బైక్ పైనుంచి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో మృతిచెందాడు. తల్లి సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనయ్య వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

పెబ్బేరు: మండలంలోని గుమ్మడం తండా సమీపంలో మోపెడ్ వాహనం అదుపు తప్పడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గుమ్మడం గ్రామానికి చెందిన బోయ వెంకటసాయి(57), నేతులు చిన్న వెంకటస్వామి కలిసి మోపెడ్ వాహనంపై గుమ్మడంతండాలో పెళ్లికి హాజరై తిరిగి వస్తున్న క్రమంలో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో బోయ వెంకటసాయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీష్‌రెడ్డి తెలిపారు.

కాల్వలో పడి..

ఎర్రవల్లిచౌరస్తా: కాల్వలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కోదండాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటస్వామి కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలం మిట్టసగూడెం గ్రామానికి చెందిన షబ్బీర్ (30) మతిస్థిమితం కోల్పోయి జాతీయ రహదారిపై తిరుగుతూ ఉండేవాడు. ప్రమాదవశాత్తు వల్లూరు సమీపంలోని కాల్వలో పడి మృతి చెందాడు. గుర్తించిన స్థానికులు హైవే పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బావ అబ్దుల్ సలీం ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

జడ్చర్ల: విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని కొత్త తండాకు చెందిన ముడావత్ దేవి(45)గురువారం తండాలో తాను నిర్వహిస్తున్న హోటల్ కరెంట్ ప్లగ్ పెడుతుండగా, ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైంది. వెంటనే వైద్య చికిత్స కోసం ఏనుగొండ ఎస్వీఎస్‌కు అటు నుంచి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గమనించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి 10:30 గంటలకు మృతి చెందింది. శుక్రవారం మృతురాలి తండ్రి నేనావత్ హీర్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రాణాలు తీస్తున్న 'ఆర్టీసీ'



- ఇటీవల పెరిగిన బస్సు ప్రమాదాలు
- వెనుక నుంచి ఢీకొడుతున్న ఘటనలే అధికం

మహబూబ్‌నగర్ క్రైం: 'కొకుంట్ల మండల కేంద్రానికి చెందిన ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థి అరవింద్(23) డిసెంబర్ 13న స్కూటీపై జేపీఎన్‌సీఈ కళాశాలకు వెళ్తుంటే మార్గమధ్యలో పట్టణంలోని పాలమూరు యూనివర్సిటీ సమీపంలో వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో టైర్ల పడి అక్కడిక్కడే మృతి చెందాడు.'

➪ నారాయణపేట జిల్లా మరికల్ మండలం తీలేరు చెందిన లాల్‌కోట కాశమన్న తన పిల్లలు అఖిల్(13), కూతురు చైతన్యతో కలిసి ఈనెల 17న మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో స్వగ్రామం నుంచి మహబూబ్‌నగర్‌కు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్‌చౌరస్తా సమీపంలో పెట్రోల్ బంకు దగ్గర వెనుక నుంచి నారాయణపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ వేగంగా ఢీకొట్టాడు. బైక్‌పై ఉన్న అఖిల్ బస్సు టైర్ కిందపడటంతో శరీరం పూర్తిగా నుజ్జునుజ్జయ్యి మృతి చెందాడు. చైతన్యకు, తండ్రికి గాయాలయ్యాయి.

➪ జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లికి చెందిన వెన్న అలివేలమ్మ(35) పాలమూరు యూనివర్సిటీలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తుంది. విధులలో భాగంగా ఈనెల 21న ఉదయం 8:30గంటల ప్రాంతంలో బండమీదిపల్లి నుంచి పాలమూరు యూనివర్సిటీకి నడుచుకుంటూ వెళ్తుంటే మార్గమధ్యలో పశు సంవర్ధక డిప్లొమా సమీపంలో మహబూబ్‌నగర్ నుంచి నారాయణపేట వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. ఆస్పత్రికి తీసుకువెళ్లిన తర్వాత ఆమె మృతి చెందింది.


పాతబస్టాండ్ సమీపంలో బస్సు కింద పడి స్కూటీ (ఫైల్)

> **జీరో యాక్సిడెంట్ పాలసీ పెట్టాం..**
>
> మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలో జీరో యాక్సిడెంట్ పాలసీ పెట్టుకున్నాం. మూడు నెలల నుంచి మంగళ, శుక్రవారాల్లో ఒక్కో డిపో నుంచి ఇద్దరూ, ముగ్గురు చొప్పున 9డిపోల పరిధిలో 25నుంచి 30మంది డ్రైవర్లకు శిక్షకుడి ద్వారా శిక్షణ ఇస్తున్నాం. దీంతోపాటు ర్యాష్ డ్రైవింగ్, ఎక్కువ స్పీడ్ నడిపి డ్రైవర్లను గుర్తించడానికి సేఫ్టీ వార్డెన్స్, ఎస్‌డీఐలను ఏర్పాటు చేశాం. ప్రతి రోజు ఉదయం డిపోలలో భద్రత సూక్తి చెబుతున్నాం. రాబోయో రోజుల్లో ఆర్టీసీ బస్సు ద్వారా ఒక్క ప్రమాదం కాకుండా చర్యలు చేపట్టాం. – శ్రీదేవి, ఆర్ఎం

➪ ఆర్టీసీ డ్రైవర్ అంటే ప్రత్యేక శిక్షణ.. హెవీ డ్రైవింగ్ లైసెన్స్.. పనితీరుపై నిత్య పరిశీలన ఉంటుంది. ఇన్ని ఉన్నా ప్రమాదాల కట్టడి కావడం లేదు. ఇటీవల జిల్లాలో చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల్లో అధికంగా ఆర్టీసీ బస్సుల ద్వారానే అవుతున్నాయి. డ్రైవర్లకు సరైన అవగాహన లేకపోవడంతో పాటు ర్యాష్ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. బస్సు డ్రైవర్లు మలుపుల వద్ద, రోడ్డు దాటుతున్న క్రమంలో ఇతర వాహనాలు గమనించకుండా మలుపుతుంటారు. దీనికి తోడు రద్దీ చోట కూడా ఎక్కువ వేగంతో వెళ్లడం ప్రమాదాలకు కారణం అవుతుంది. ప్రధానంగా మహబూబ్‌నగర్ నుంచి దేవరకద్ర వైపు, మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్ల, హన్వాడ, భూత్పూర్ రూట్‌లలో ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జిల్లా కేంద్రంలో పాత బస్టాండ్ నుంచి కోయిలకొండ ఎక్స్‌రోడ్ వరకు వాహనరాకపోకలు అధికంగా ఉండటంతో పాటు రోడ్డు పక్కనే కూరగాయలు విక్రయించడం వల్ల ఈ రూట్‌లో బస్సు ప్రమాదాలు తరచూ అవుతున్నాయి.

ఇసుక రీచ్ వద్ద ఇరువర్గాల ఘర్షణ

మాగనూర్: ఇసుక రీచ్ వద్ద ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వర్కూర్‌లో ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్న ఇసుక రీచ్ వద్ద గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇసుక లోడ్ విషయంలో ప్రతి రోజు మీ జేసీబీనే ఉంచడం ఏమటని, గ్రామంలో మిగతా వారికి కూడా ఉపాధి అవకాశాలు కల్పించి కొన్ని రోజులు మా జేసీబీ కూడా లోడ్‌కు ఉంచాలని నిలదీశాడు. దీంతో మాటామాటా పెరిగి చివరికి కొట్టుకునే వరకు చేరుకుంది. దీంతో స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని సముదాయించారు. ఒక్కసారిగా విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాత్రి 7 గంటలకు ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు.


ఇసుక రీచ్ వద్ద కొట్టుకుంటున్న ఇరువర్గాలు

బంగారం చోరీ కేసులో వ్యక్తి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ జములప్ప

బాలానగర్: మహిళను బెదిరించి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటనలో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జములప్ప తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. మండలంలోని పెద్దరేళ్లలో మంగళవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న వడ్యాల పద్మమ్మను బెదిరించి 7.5 తులాల బంగారు ఆభరణాలను జాజిమొగ్గల సురేష్, అలియాస్ చాకలి సురేష్ ఎత్తుకెళ్లాడన్నారు. పేయింటర్‌గా పనిచేస్తున్న నిందితుడు కష్టపడకుండా సంపాదించాలనే ఆలోచనతో దొంగతనం చేస్తుంటాడని తెలిపారు. కేసును ఛేదించేందుకు కృషి చేసిన ఎస్ఐలు జయప్రసాద్, వెంకట్‌రెడ్డిని సీఐ అభినందించారు.

వ్యక్తి రిమాండ్

మాగనూర్: మండలంలోని అమ్మపల్లిలో ఈనెల 22న కురువ మల్లమ్మ ఇంట్లో డబ్బులు, బంగారు కమ్మలు దొంగతనం చేశారు. ఈ కేసు విచారణలో అదే గ్రామానికి చెందిన కుర్వ నాగపొల్ల మహేష్‌పై అనుమానం వ్యక్తం చేయగా, శుక్రవారం వాడ్వాట్ గేట్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించడం పోలీసులు పట్టుకొని విచారణ చేశారు. దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. అతడి నుంచి రూ.47,700లు, రెండు గ్రాముల చెవి కొమ్ము స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి నారాయణపేట కోర్టులో హాజరుపర్చగా, జడ్జి నిందితుడికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రాష్ట్రంలో కుంటుపడిన విద్య, వైద్యరంగాలు

పాలమూరు: సీఎం కేసీఆర్ పాలమూరు జిల్లాకు చేసింది ఏమిలేదని, రాష్ట్రం ఏర్పాటు తర్వాత పాలమూరు యూనివర్సిటీలో కనీసం ఐదుగురు రెగ్యులర్ ఆచార్యులను నియమించలేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మండిపడ్డారు. జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అప్పన్నపల్లిలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఏ యూనివర్సిటీ లోపలికి అడుగుపెట్టే ధైర్యం ఈ కేసీఆర్‌కు ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో వైద్యం, విద్య రెండు కుంటుపడ్డాయని, పోలీసులు లేకుండా బీఆర్ఎస్ నాయకులు ప్రజల్లో తిరగలేని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన భార్యాభర్తలు ఇద్దరికి పింఛన్ అందిస్తామని, పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. కేసీఆర్ కేవలం ఓట్ల కోసమే రాజకీయం చేస్తున్నాడు తప్ప ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదవారిని అభివృద్ధి చేయాలనే ఉద్దేశం ఈ కేసీఆర్‌కు లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, నాయకులు ఎన్పీ వెంకటేష్, అంజయ్య, నారాయణయాదవ్, రామాంజనేయులు, పాండురంగారెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీకే అరుణ

హత్య కేసులో ముగ్గరికి జైలు శిక్ష

గద్వాల క్రైం: భార్యను, కూతురిని కిరోసిన్ పోసి హత్య చేసిన సంఘటనలో ముగ్గురు నిందితులకు శుక్రవారం 5సంవత్సరాల కఠిన కారాగార జైలుశిక్షతో పాటు రూ.500ల జరిమానా విధిస్తూ గద్వాల అదనపు సీనియర్ సివిల్ సెషన్ కోర్టు జడ్జి ప్రభాకర్ తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అలంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గొందిమల్లకు చెందిన ఈశ్వరయ్య, శైలజ(28)లకు 2013లో వివాహమైంది. వీరికి రెండేళ్లకు మాధురి(01) జన్మించింది. తరచూ భార్యను భర్తతో పాటు అత్తామామలు (మునెమ్మ, కృష్ణయ్య)లు మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలోనే కుటుంబంలో వివాదం చోటుచేసుకుంది. 2015 అక్టోబర్ 17వ తేదీన భార్య, కూతురుపై ఈశ్వరయ్యతో పాటు మునెమ్మ, కృష్ణయ్యలు ఇంట్లో కిరోసిన్ పోసి నిప్పంటించి హత్య చేశారు. హత్య సంఘటనపై మృతురాలి తల్లి సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని కోర్టులో చార్జ్‌షీట్ దాఖాలు చేశారు. కేసు విచారణలో భాగంగా శుక్రవారం కోర్టులో వాదనలు విన్న జడ్జి ముగ్గురు నిందితులకు ఐదేళ్ల కఠిన కారాగార జైలుశిక్షతో పాటు రూ.500ల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. ఈ కేసు విచారణ చేసిన అప్పటి సీఐ వెంకటేశ్వర్లు, ప్రస్తుత సీఐ సూర్యనాయక్‌లను జిల్లా ఎస్పీ సృజన, డీఎస్పీ రంగస్వామిలు అభినందించారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి


చనిపోయిన గొర్రెపిల్లల వద్ద బాధితుడు

ఉప్పునుంతల: మండలంలోని జప్తిసదగోడులో కొట్టం నిరంజన్‌కు చెందిన నాలుగు గొర్రె పిల్లలను శుక్రవారం వీధి కుక్కలు కొరికి చంపేశాయి. రోజు మాదిరిగానే గ్రామ సమీపంలో ఉన్న పాకలో గొర్రె పిల్లలను జల్లీ కింద వేసి గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. మధ్యాహ్నం జల్లీలోకి చొరబడిన కుక్కలు గొర్రె పిల్లలను కొరికి చంపేశాయి. కుక్కలను నియంత్రించాలని కాపరులు కోరుతున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

నాగర్‌కర్నూల్ రూరల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు గడుస్తున్నా పేదలకు అనుకూలమైన సంక్షేమ పథకాలను అమలు చేయకుండా బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్ పరిశ్రమలకు దోచిపెడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల సంక్షేమ పథకాలు విస్మరిస్తూ పెట్టుబడిదారులు, పరిశ్రమల కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. ఇక్కడి ధనవంతులు ఇతర దేశాల్లో దాచిన నల్లధనాన్ని తీసుకువస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ మాట తప్పారని అన్నారు. రూ.14 లక్షల కోట్లు బడా పెట్టుబడి దారులకు రాయితీలు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రతిష్టపరచాల్సిన మోదీ గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌లో ఇంకా నిధులు తగ్గించారని, గుజరాత్ లాంటి రాష్ట్రంలో ఏడు సార్లు అధికారంలోకి వచ్చినా అక్షరాస్యతలో ఆ రాష్ట్రం ఇంకా వెనకబడి ఉందని అన్నారు. దేశంలో ఆ పార్టీ అధికారంలో లేని రాష్ట్రాలలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలలను ప్రలోభాలకు గురిచేసి అధికారంలోకి రావడం జరిగిందని గుర్తు చేశారు. మార్చి, ఏప్రిల్‌లో జరిగే క్యాంపులను విజయవంతం చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు నిర్వహించనున్నట్లు, గ్రామగ్రామాన బీజేపీ వ్యతిరేక విధానాలు ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ఆర్ శ్రీనివాసులు అధ్యక్షత వహించగా.. జిల్లా కార్యదర్శి పర్వతాలు, నాయకులు ఆంజనేయులు, దేశ్యనాయక్, శంకర్‌నాయక్, అశోక్, శివవర్మ, నర్సింహా, బాలస్వామి, అంతటి కాశన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. ఎడమ కాల్వ ద్వారా 920, సమాంతర కాల్వ ద్వారా 143 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 900, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

అడ్డాకుల: మండలంలోని రాచాల చెందిన వివాహిత కనిపించడం లేదని ఆమె భర్త ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. గంటెల పరశురామ్, వనజాత దంపతులు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పరశురామ్ లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈక్రమంలో కుటుంబ సంసారం విషయంలో ఈనెల 22న భార్యాభర్తలు గొడవపడ్డారు. ఇంతలోనే వనజాత ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. వనజాత తల్లిదండ్రులది కూడా రాచాలనే కావడంతో బంధువుల వద్దకు వెళ్లి ఉంటుందని భావించారు. ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

అచ్చంపేట రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 19ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు అచ్చంపేట ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. శుక్రవారం అచ్చంపేటలోని ఓ కళాశాలకు వెళ్లిన యువతి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో యువతి తల్లిదండ్రులు సమీప బంధువులు ఇంటి వద్ద వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో సాయంత్రం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బ్యాంకు మేనేజర్‌కు గాయాలు

భూత్పూర్: మున్సిపాలిటీలోని శేరిపల్లి(బి) వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి మోటారుసైకిల్‌ను లారీ ఢీకొట్టిన సంఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణానికి చెందిన మహ్మద్ హమీద్ మోటారుసైకిల్‌పై జడ్చర్లకు పని నిమిత్తం వెళ్లాడు. తిరిగి భూత్పూర్‌కు వస్తుండగా, శేరిపల్లి(బి) వద్ద జాతీయ రహదారిపై వెనకాలే వస్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించి జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఆస్పతిరకి తరలించినట్లు బంధువులు తెలిపారు. మహ్మద్ హమీద్ వికారాబాద్ జిల్లా కొడంగల్ డీసీసీ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు.

18మంది బైండోవర్


కోడేరు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 18 మంది సారా విక్రయిస్తుండగా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకొని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు ఎదుట శుక్రవారం బైండోవర్ చేశారు. ఎవరైనా సారా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్ఐ మమత హెచ్చరించారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి


అమ్రాబాద్: మండలంలోని తిర్మలాపూర్(బీకే)కి చెందిన జటగోని వెంకట్రావు(60) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకట్రావు తన ద్విచక్రవాహనంపై గురువారం సాయంత్రం అమ్రాబాద్ వస్తుండగా.. అమ్రాబాద్ సమీపంలో లింగమయ్యస్వామి ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో, బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో వెంకట్రావ్ తీవ్రంగా గాయపడ్డాడు. రాత్రి హైదరాబాద్ తరలిస్తుండగా.. మార్గ మధ్యంలో మృతిచెందాడు. ఈ సంఘటనపై ఆటో డ్రైవర్ పెరుమాళ్ల నాగేంద్రబాబుపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- తప్పించుకునే ప్రయత్నంలో కిందపడి ఒకరు మృతి
- జోగుళాంబ గద్వాల జిల్లా కుర్వపల్లిలో ఘటన


గోపాల్ (ఫైల్)

గద్వాల క్రైం: గుట్టుగా పేకాట ఆడుతున్న వారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ క్రమంలో పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఓ యువకుడు కింద పడి మృతిచెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గద్వాల మండలంలోని కుర్వపల్లిలో నర్సింహులు, మలేష్, పరశురాముడు, గోపాల్, వెంకటేష్, రామన్న, వెంకటస్వామి, కుర్వ గోపాల్(30), విజయ్ గురువారం రాత్రి పేకాట ఆడుతున్నారు. దీనిపై సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు 11 గంటల సమయంలో పేకాట స్థావరం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో పలువురు పోలీసుల నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీయగా.. ముగ్గురు మాత్రమే పోలీసులకు చిక్కారు. వీరి నుంచి రూ.9,010 నగదు, సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు.


మృతిచెందిన కుర్వ గోపాల్ చేతిలో నగదు

తప్పించుకునే ప్రయత్నంలో..

పేకాట ఆడుతున్న దగ్గర కుర్వ గోపాల్(30) పేకాటరాయుళ్లకు డబ్బులు అప్పుగా ఇచ్చేవాడు. తనతో ఉన్న రూ.70 వేలు పోలీసులకు దొరుకుతాయనే ఉద్దేశంతో వారి నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీశాడు. అయితే చీకటిగా ఉండటంతో భద్రయ్య దొడ్డి సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. కుర్వ గోపాల్ రాత్రి నుంచి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు శుక్రవారం వాకబు చేశారు. ఈ క్రమంలో భద్రయ్య దొడ్డి సమీపంలో అనుమానాస్పదంగా కిందపడి ఉండడం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. కుర్వ గోపాల్ నోట్లో నుంచి రక్తం వచ్చిందని, కిందపడిన సమయంలో గుండెకు దెబ్బ తగిలి మృతిచెంది ఉంటాడని అనుమానిస్తున్నారు.

వెంబడించలేదు..

గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు కొందరు సమాచారం అందించడంతో నలుగురు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ నందికర్ తెలిపారు. తమను పసిగట్టిన కొందరు పేకాటరాయుళ్లు తప్పించుకునేందుకు ప్రయత్నించగా ముగ్గురిని పట్టుకొని నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. రాత్రి కావడంతో వారిని ఉదయం గద్వాల రూరల్ పోలీసుస్టేషన్‌లో ఉంచామన్నారు. కుర్వ గోపాల్ మృతిచెందిన విషయం మీడియా, వివిధ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాల ఆధారంగా తెలిసిందని చెప్పారు. తాము ఎవరినీ వెంబడించలేదని పేర్కొన్నారు. ఈ విషయమై గద్వాల రూరల్ ఎస్ఐ ఆనంద్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. పేకాట స్థావరంపై దాడులు చేసి ముగ్గురు వ్యక్తులను గుర్తించినట్లు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చెప్పడంతో శుక్రవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. రామన్న, వెంకటస్వామి, కుర్వ గోపాల్, విజయ్‌లు పరారీలో ఉన్నారని, అయితే కుర్వ గోపాల్ మృతిచెందినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసిందన్నారు. ఈ ఘటనపై గేమింగ్ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా...

అజయ్ బంగా హెచ్‌పీఎస్ విద్యార్థే

ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా నామినేట్ అయిన బంగా



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా నామినేట్ అయిన భారత-అమెరికన్ అజయ్ బంగా బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) విద్యార్థే. మాస్టర్ కార్డ్ మాజీ సీఈవో అజయ్ బంగా 1976 బ్యాచ్‌కు చెందిన హెచ్‌పీఎస్ విద్యార్థి. ప్రస్తుత వరల్డ్ బ్యాంకు ప్రెసిడెంట్ మాల్పాస్ తర్వాత అజయ్ నామినేట్ అయిన సంగతి తెలిసిందే. 'మా పూర్వ విద్యార్థుల్లో మరొకరు ప్రపంచ సంస్థలో ఉన్నత స్థాయికి చేరుకోవటం పాఠశాలకు గర్వకారణం' అని హెచ్‌పీఎస్ సొసైటీ ప్రెసిడెంట్ గుస్తీ జే నోరి యా తెలిపారు. కాగా, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల అధినేతలు హెచ్‌పీఎస్ విద్యార్థులే కావటం విశేషం. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యనాదెళ్ల, అడోబ్ సీఈవో శంతను నారాయణ్‌తో పాటు కావియం కో-ఫౌండర్ సయ్యద్ భక్రత్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, క్రికెటర్ కామెంటర్ హర్షా భోగ్లే, ప్రముఖ సినీనటులు రానా దగ్గుపాటి, అక్కినేని నాగార్జున, రామ్‌చరణ్, ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, సమైక్యాంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి వంటి ఎందరో ప్రముఖులు హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థులు.

కొత్తగా 16 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శుక్రవారం 3,209 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 16 మంది వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి నలుగురు కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది.



ఏపీలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషపు రాతలు రాస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నందుకు నిరసనగా శుక్రవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో 'ఈనాడు' ప్రతులను తగులబెడుతున్న ప్రజలు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఏపీలో పెట్టుబడులకు అవకాశాలు పుష్కలం

- పరిశ్రమలకు అనువైన పరిస్థితులు కల్పించడంలో ఏపీ ముందుంది
- సగటున 12 రోజుల్లోనే అనుమతులు
- పరిశ్రమలకు 48 వేల ఎకరాలు సిద్ధం
- హైదరాబాద్‌లో జీఐఎస్ రోడ్ షోలో మంత్రులు రాజేంద్రనాథ్, అమర్‌నాథ్
- ఏపీలో పెట్టుబడులు పెట్టాలని పెట్టుబడిదారులకు ఆహ్వానం



సమావేశంలో పాల్గొన్న మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమర్‌నాథ్ తదితరులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సుదీర్ఘ తీరప్రాంతం, పుష్కలమైన వనరులు, సుశిక్షితులైన మానవ వనరుల లభ్యత, వ్యాపారాలకు ప్రభుత్వ తోడ్పాటు తదితర సానుకూల అంశాలతో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యామ్నాయం మరేదీ లేదని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. సత్వరం అనుమతులు మంజూరు చేస్తూ వ్యాపారాలు, పరిశ్రమలకు అనువైన పరిస్థితులు కల్పించడంలో ఏపీ ప్రభుత్వం ముందుందని చెప్పారు. విశాఖ ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు (జీఐఎస్) 2023కు సంబంధించి హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన రోడ్ షోలో వారు మాట్లాడారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఇన్వెస్టర్లను ఆహ్వానించారు. సుస్థిర అభివృద్ధి సాధిస్తూ ముందుకెళ్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరిశ్రమలకు అవసరమైన సకల మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని మంత్రి బుగ్గన వివరించారు. నిపుణుల కొరతను అధిగమించేందుకు నైపుణ్యాల్లో శిక్షణకు కూడా పెద్ద పీట వేస్తోందన్నారు. ఐటీ, బల్క్ డ్రగ్ పార్క్, పీసీపీఐఆర్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, మెరైన్, వ్యవసాయం, పునరుత్పాదకశక్తి వంటి రంగాలలో పెట్టుబడులకు ఏపీ అనుకూలమన్నారు.

అనుమతుల సమయాన్ని కుదించాం

రాష్ట్రంలో పరిశ్రమల కోసం 48వేల ఎకరాలకు పైగా స్థలం సిద్ధంగా ఉందని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. పారిశ్రామికవేత్తలకు స్థలం కాకుండా సగటున 12 రోజుల్లోనే అనుమతులు లభిస్తున్నాయని తెలిపారు. కొత్తగా తేబోయే పాలసీలో 21 రోజుల్లో స్థలాన్ని కేటాయించాలని భావిస్తున్నట్లు వివరించారు. 974 కి.మీ. సుదీర్ఘ తీర ప్రాంతం, 534 ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లు, 6 సెజ్‌లు, 3 ఐటీ సెజ్‌లు, 3 పారిశ్రామిక కారిడార్లు, మంచి వృద్ధి రేటుతో పెట్టుబడులకు పూర్తి అనుకూలమని పేర్కొన్నారు. వైజాగ్ ఐటీ గమ్యస్థానంగా మారుతోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో వేలకొద్దీ చిన్న, మధ్య తరహా సంస్థలు ఏర్పాటవుతున్నాయని ఏపీటీపీసీ చైర్మన్ కె.రవిచంద్రారెడ్డి తెలిపారు. బాక్సైట్, మాంగనీస్ తదితర 48 రకాల ఖనిజాల లభ్యత పుష్కలంగా ఉందన్నారు. ఏపీలో అవకాశాలను తెలియజేసేందుకు, పారిశ్రామిక భాగస్వామ్యాలు కుదుర్చుకునేందుకు జీఐఎస్ తోడ్పడుతుందని తెలంగాణ సీఐఐ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి చెప్పారు.

పారిశ్రామికవేత్తల హర్షం

ప్రస్తుతం రాష్ట్రంలో కార్యకలాపాలు సాగిస్తున్న పారిశ్రామికవర్గాలు ప్రభుత్వ సహకారంపై సంతృప్తి వ్యక్తం చేశాయి. పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటునందిస్తోందని డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఎండీ డీవీఎస్ నారాయణ రాజు తెలిపారు. ఏపీలోని తమ ప్లాంటులో నీరు, విద్యుత్ కొరత లేదని చెప్పారు. విద్యుత్, ఇంధనం కూడా మిగతా రాష్ట్రాలతో పోలిస్తే చౌకగా లభిస్తున్నాయన్నారు. స్విచ్‌గేర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ డైరెక్టర్ ఒ.జగన్నాథ్ మాట్లాడుతూ తమ సంస్థ ఇప్పటికే చిత్తూరు ఇండస్ట్రియల్ పార్క్‌లో కార్యకలాపాలు సాగిస్తోందని, మరో రూ.150 కోట్లు పెట్టుబడి పెడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పలు సబ్సిడీలు అందిస్తోందని, పరిశ్రమల నిర్వహణ సులభతరం చేసిందని వివరించారు.



ఏపీ గవర్నర్‌గా జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ శుక్రవారం పదవీ స్వీకార ప్రమాణం చేశారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆయనతో పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. పదవీ స్వీకార ప్రమాణం అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్‌కు అభినందనలు తెలిపి సత్కరించారు.

విచారణపై సందేహాలు

▶ మొదటి పేజీ తరువాయి

విచారణకు కొనసాగింపుగా శుక్రవారం రెండోసారి సీబీఐ అధికారుల విచారణకు హాజరైనట్లు తెలిపారు. గతంలో విచారణప్పుడు మరోమారు పిలుస్తామని చెప్పారని, ఈసారి మాత్రం మళ్లీ విచారణకు రావాలని చెప్పలేదన్నారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి ఇంకా ఏమన్నారంటే..

మీడియా బాధ్యతగా వ్యవహరించాలి

- మీడియా బాధ్యతగా వార్తలు ప్రసారం చేయాలని మనవి చేస్తున్నా. గతంలోనూ ఇదే విషయం చెప్పాను. మళ్లీ అదే చెబుతున్నా. నేను విజయమ్మ గారి దగ్గరికి వెళ్లి వస్తే.. బెదిరించి వచ్చానని చర్చలు పెట్టి, ప్రచారం చేస్తున్నారు. అది ఎంత వరకు సబబు? నేను దుబాయ్‌కి వెళ్లిపోయానని వక్రీకరించే వార్తలు వేస్తున్నారు.
- తెల్లవారుజామున 3 గంటలకు ఫోన్లు చేశానని వక్రీకరించే వార్తలు వేయడమే కాకుండా దానిపై గంటల తరబడి, రోజులపాటు చర్చలు పెడుతున్నారు. విచారణ జరుగుతున్నప్పుడు మీడియా బాధ్యతగా మెలగాలి. మీడియానే ట్రయల్ పూర్తి చేసి..దోషులెవరో, నిర్దోషులెవరో మీడియానే నిర్ణయిస్తోంది. ఇది విచారణపై ఎంత ప్రభావం పడుతుందో ఒకసారి మీరే ఆలోచించండి. ఒక అబద్ధాన్ని సున్నా నుంచి వందకు పెంచే ప్రయత్నం జరుగుతోంది. అదేవిధంగా ఒక నిజాన్ని వంద నుంచి సున్నా చేసే ప్రయత్నం జరుగుతోంది.
- ముందు నుంచి కూడా ఫ్యాక్ట్ టార్గెట్‌గా కంటే పర్సన్ టార్గెట్‌గా విచారణ జరగడం సరికాదు. గూగుల్ టేకౌట్ అన్నది నిజమైన గూగుల్ టేకౌటా.. టీడీపీ టేకౌటా అన్నది భవిష్యత్తులో కాలమే నిర్ణయిస్తుంది. ఎందుకు ఈ మాట అంటున్నానంటే.. సీబీఐ సమర్పించిన కౌంటర్‌లోని విషయాలన్నీ ఏడాది క్రితం టీడీపీ వాళ్లు చేసిన విమర్శలే. అందువల్ల ఎవరికైనా సందేహాలు రావడం సహజం. ఈ పరిస్థితిలో విచారణ సరైన కోణంలో వెళ్లాలని చెబుతున్నాను తప్ప.. నేను అనుమానించడం లేదు.

ఆ రోజు చెప్పిందే ఈ రోజూ చెబుతున్నా

- వివేకం సార్ చనిపోయిన రోజు నేను మార్చురీ దగ్గర మీడియాతో మాట్లాడాను. మళ్లీ రెండు రోజుల తర్వాత కూడా మీడియాతో మాట్లాడాను. ఆ రోజు ఏం మాట్లాడానో.. ఈ రోజు కూడా అదే మాట్లాడుతున్నా. సీబీఐ వాళ్లకు అదే చెబుతున్నా. ఎవరెన్నిసార్లు పిలిచి అడిగినా అదే చెబుతా. ఎందుకంటే నాకు తెలిసిన నిజం అదే కాబట్టి.
- ఆ రోజు ఆ విషయం గురించి మీడియాతో మాట్లాడిన మొట్టమొదటి వ్యక్తి నేనే. అందుకే నేను ఆ రోజు చెప్పిందే ఈ రోజూ చెబుతున్నా. సీబీఐ వారి ప్రశ్నలకు నాకు తెలిసిన సమాధానాలు చెప్పాను.
- వివేకం సార్ చనిపోయిన రోజు సీన్ ఆఫ్ క్రైంకి నేను వెళ్లేటప్పటికే అక్కడ ఒక లెటర్ ఉంది. కానీ, ఆ లెటర్‌ను దాచిపెట్టారు. ఆ లెటర్‌లో అది హత్య అని స్పష్టంగా ఉంది. అందులో అనేక అంశాలు ఉన్నాయి. ఆ విషయాల గురించి నేను చెప్పడం కంటే భవిష్యత్తులో అవన్నీ బయటికి వస్తాయి.
- ఇంతకు ముందు అడిగినట్టే అడ్వొకేట్ సమక్షంలో ప్రశ్నించాలని, అన్ని విషయాలు ఆడియో.. వీడియో రికార్డింగ్ చేయాలని ఇప్పుడు కూడా కోరాం. ఈ మేరకు సీబీఐ డైరెక్టర్ కూడా లెటర్ పెట్టాం. కానీ అది జరగలేదు. అయితే ఒక ల్యాప్‌టాప్‌ను మాత్రం నా ముందు ఉంచారు. అది ఎందుకోసం అన్నది నాకు తెలియదు.

నియోజకవర్గ కమిటీలకు పెద్దపీట

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తి సమయం ఇచ్చే 90 మంది కార్యకర్తలను ఎంపిక చేసి వారికి తొలుత వచ్చే నెల 3 నుంచి 6 వరకు నియోజకవర్గాలవారీగా వర్క్‌షాప్స్ నిర్వహించనుంది. అనంతరం అభియాన్ నిర్వహణ తీరుపై శిక్షణ ఇవ్వనుంది. అలాగే పోలింగ్‌బూత్ కమిటీల్లో సభ్యుల సంఖ్యను 21 నుంచి 31కి పెంచాలని బీజేపీ నిర్ణయించింది.

'బండి'ఆధ్వర్యంలోనే ఎన్నికలు...

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలోనే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ తాజాగా స్పష్టతనిచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీని ఎన్నికలకు సిద్ధం చేయడంలో భాగంగా సంస్థాగతంగా మార్పులు చేసేందుకు ఆయన సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. రాష్ట్ర పదాధికారులు, కార్యవర్గం, అధికార ప్రతినిధులు, జిల్లా కమిటీలు, ఏడు మోర్చాలు, అనుబంధ విభాగాల్లో అంతగా క్రియాశీలంగా లేనివారు, పార్టీ ఆశించిన మేర పనిచేయని వారు, నిర్దేశిత లక్ష్యాలను సాధించని వారిని పక్కన పెట్టనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జిల్లా అధ్యక్షుల పనితీరును ప్రాతిపదికగా చేసుకొని దాదాపు 20–25 జిల్లాల అధ్యక్షుల స్థానంలో నియోజకవర్గస్థాయి అధ్యక్షులు లేదా ఇన్‌చార్జీలతో ఎన్నికల కసరత్తుకు దిగాలనే యోచనలో బీజేపీ ఉన్నట్లు సమాచారం. వారిలో 20 జిల్లాల అధ్యక్షులు, కమిటీల మూడేళ్ల పదవీకాలం ముగిసినందున ఈ మార్పులు చోటుచేసుకోనున్నాయి.

పర్యవేక్షణ ఫుల్‌టైమర్లదే: బన్సల్

సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయిలో సంస్థాగతంగా పార్టీకి సంబంధించిన అంశాల పర్యవేక్షణ బాధ్యత పార్టీ ఫుల్‌టైమర్లదేనని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ స్పష్టంచేశారు. శక్తికేంద్రాల (3, 4 పోలింగ్ బూత్‌లు కలిపి ఒక శక్తికేంద్రం) ఇన్‌చార్జీలతో పాటు పార్టీ మండల అధ్యక్షులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. శుక్రవారం రాత్రి దాకా పార్టీ కార్యాలయంలో 17 లోక్‌సభ నియోజకవర్గాలు, 40–50 అసెంబ్లీ నియోజకవర్గాల ఫుల్‌టైమర్లతో బన్సల్, జాతీయ కార్యదర్శి, సహ ఇన్‌చార్జి అర్వింద్ మీనన్‌సమీక్షించారు. ఎన్నికలు ముగిసేదాకా ఫుల్‌టైమర్లు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లోనే బస చేసి, పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

పోలేపల్లికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనం కోసం క్యూలో భక్తులు

కోస్గి: పోలేపల్లి ఎల్లమ్మ జాతరకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. వివిధ గ్రామాలకు చెందిన మహిళలు బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మేకలు, గొర్రెలు, కోళ్లను కోసి, కల్లుసాకతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మార్కెట్లోకి టీవీఎస్ ఎలక్ట్రిక్ వాహనాలు



నూతన మాడల్ ఎలక్ట్రికల్ వాహనాలు విడుదల చేస్తున్న ప్రతినిధులు

పాలమూరు: మహబూబ్‌నగర్‌లోని శ్రీజయరామ టీవీఎస్ షోరూంలో శుక్రవారం టీవీఎస్ కంపెనీ నుంచి కొత్తగా రెండు ఎలక్ట్రిక్ వాహనాలను శ్రీజయరామ సంస్థల అధినేత బెక్కరి రాంరెడ్డి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీవీఎస్ కంపెనీ నుంచి ఐక్యూబ్, ఐక్యూబ్ ఎస్ ఎలక్ట్రిక్ వాహనాలను మూడు వేరియంట్స్‌తోపాటు ఐదు రంగుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వాహనాల వల్ల కాలుష్యం, శబ్దకాలుష్యాన్ని నివారించవచ్చని చెప్పారు. ఈ ఎలక్ట్రిక్ వాహనాలు పూర్తిగా డిజిటల్ మీటర్, హెచ్ఎంఐ కంట్రోలర్, టూమోడ్స్, పవర్, ఇకోలో లభిస్తాయన్నారు. దీని బ్యాటరీ సామర్థ్యం 3.04 కిలోవాట్స్ రెండు లిథియం బ్యాటరీ కలిగి ఉందన్నారు. ఒక్కసారి చార్జింగ్ చేయడం వల్ల వంద కిలోమీటర్లు ప్రయాణించవచ్చన్నారు. ఎలక్ట్రిక్ వాహనం బ్యాటరీ, మోటార్‌పై మూడేళ్లు లేదా 50 వేల కిలోమీటర్ల వారెంట్ సదుపాయం ఉందన్నారు. ఐక్యూబ్ ఎక్స్‌షోరూం ధర రూ.1,15,283 కాగా.. ఐక్యూబ్ ఎస్ షోరూం ధర రూ.1,21,413 అని, బుక్‌చేసిన నెల రోజుల తర్వాత వాహనం వస్తోందన్నారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ మహ్మద్ యాకూబ్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేనా?



వనపర్తి రోడ్ రైల్వేస్టేషన్

- వనపర్తి రోడ్డు స్టేషన్‌లో ఆపాలని స్థానికుల డిమాండ్
- పాలమూరు ఎంపీగా హామీ ఇచ్చిన కేసీఆర్

మదనాపురం: వనపర్తి జిల్లాలోని ఏకైక రైల్వేస్టేషన్ మదనాపురంలోని వనపర్తి రోడుడ్ స్టేషన్. నిత్యం ఈ స్టేషన్ మీదుగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళ్తున్నా.. స్టాప్ లేకపోవడంతో స్థానికులు సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందిపడుతున్నారు. వందల సంఖ్యలో చెన్నై, బెంగళూరు, ముంబై వంటి నగరాల్లో ఈ ప్రాంతవాసులు ఎక్కువ సంఖ్యలో పనిచేస్తున్నారు. రైల్వే స్టేషన్ ఉన్నప్పటికీ రైళ్లు నిలుపకపోవడంతో చాలా ఇబ్బందిపడుతున్నారు.

రెండువేల మంది..

ఈ స్టేషన్ నుంచి వనపర్తి జిల్లాలో ఆత్మకూర్, అమరచింత, సీసీకుంట, కొత్తకోట, మదనాపురం, అడ్డాకుల, పెబ్బేరు, వనపర్తి తదితర ప్రాంతల నుంచి తిరుపతి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌తో పాటు అనేక ప్రాంతాలకు ప్రతిరోజు రెండువేల మందికి పైగా ప్రయణికులు వెళ్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్టేషన్‌లో ప్రయణికులు కన్పిస్తారు.

చెన్నై, బెంగుళూర్ ఎక్స్‌ప్రెస్..

ప్రధానంగా ఈప్రాంత ప్రజల కోసం చెన్నై, బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లు వనపర్తి రోడ్ స్టేషన్‌లో నిలిపితే ఇబ్బందులు తొలగుతాయని స్థానికులు అంటున్నారు. ప్రతిరోజు ఇక్కడి నుంచి, హైదరాబాద్ నుంచి తిరుపతి, బెంగుళూరు వెళ్లే వాళ్లకు కొంత మేలు జరుగుతుందని చెబుతున్నారు. ఉద్యమ సమయంలో అప్పట్లో పార్లమెంటు సభ్యులుగా ఉంటూ మదనాపురం మండల కేంద్రానికి సీఎం కేసీఆర్ వచ్చారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. దీంతో తెలంగాణ వచ్చిన వెంటనే ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుతామని హామీ ఇచ్చారు. నేటికీ నెరవేర్చకపోవడంతో ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత రైల్వే అధికారులు, పాలకులు స్పందించి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని కోరుతున్నారు.

ఇక్కడి నుంచి వెళ్లే రైళ్లు..

వనపర్తి రోడ్డు రైల్వేస్టేషన్ గుండా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్‌లు ప్రధానంగా చెన్నై కాచిగూడ ఎక్స్‌ప్రెస్, నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్, ఏడు కొండలు ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్, ప్రశాంతి నిలయం, కర్నాటక సంపర్క్ క్రాంతి, గోరఖ్‌పూర్, ఆంధ్రప్రదేశ్ సంపర్క్ క్రాంతి, జైపూర్ సూపర్‌ఫాస్ట్, రామేశ్వరం, అమరావతి, ఇండోర్ ఎక్స్‌ప్రెస్‌తో మరికొన్ని రైళ్లు వెళ్తాయి. కేవలం ఇక్కడ వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఇంటర్ సిటీ, తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ మాత్రమే ఆపుతారు. మిగతా ప్యాసింజర్ రైళ్లు నడుస్తాయి.

ఎక్కువ మంది వెళ్తారు..



ఈ ప్రాంతం నుంచి తిరుపతి, చెన్నై, తదితర ప్రాంతలకు అధిక సంఖ్యలో ప్రయణికులు వెళ్తారు. జిల్లాలోనే ఏకైక పెద్ద రైల్వేస్టేషన్ ఇది. నేటికీ వనపర్తి రోడ్ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపకపోవడం చాలా బాధాకరం. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి.

– పెంటయ్య, రిటైర్డ్ టీచర్, కొన్నూరు

రెండు ఎక్స్‌ప్రెస్‌లు ఆపాలి



చెన్నై- బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపితే ఈప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి ఎంపీ కేసీఆర్ మదనాపురం వచ్చినప్పుడు ప్రజలకు ఈ విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ వచ్చిన వెంటనే మీ స్టేషన్‌లో రెండు రైలు నిలిపేలా ప్రయత్నిస్తానని చెప్పారు. ఇప్పటికైనా ఆ హామీని నెరవేర్చాలి.

– అశోక్ యాదవ్, మదనాపురం

'చిత్తరువు పద్యదిశ్వతి' పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న వక్తలు

పాలమూరు: ప్రముఖ కవి డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి రచించిన చిత్తరువు పద్యదిశ్వతి అనే పుస్తకాన్ని శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. భారత జాగృతి, తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ, తెలుగు సాహితీ వికాస వేదిక సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి హాజరై పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన కవి ప్రొద్దుటూరు ఎల్లారెడ్డి, డాక్టర్ వీరబ్రహ్మేంద్రాచార్యులు, లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ దాదాపు 216 చిత్రాలకు చిత్తరువు పద్యద్విశతిని గన్నోజు అందించారని చెప్పారు. కార్యక్రమంలో అశోక్‌బాబు, వెంకటరాంమూర్తి, బాస వెంకటేశ్వర్లు, వల్లభాపురం జనార్దన్, పులి జమున తదితర కవులు పాల్గొన్నారు.



లేగదూడకు బారసాల

మండలంలోని కౌకుంట్లలో శుక్రవారం లేగదూడకు బారసాల చేసి మూగజీవాలపై ఉన్న ప్రేమను చాటారు గ్రామస్తులు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామస్తులందరూ చందాలు పోగు చేసుకొని మూడేళ్ల కిందట గ్రామంలో శ్రీలక్ష్మి గోశాలను నిర్మించారు. మొక్కుబడిగా ఆలయలకు అందించిన అవులను గోశాలలో సంరక్షిస్తారు. పుంగనూర్ జాతికి చెందిన ఓ ఆవు ఇటీవల లేగదూడకు జన్మనిచ్చింది. గ్రామస్తులందరూ కలిసి శుక్రవారం గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో వైభవంగా బారసాల నిర్వహించి కేశవుడు అని నామకరణం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ స్వప్న, నాయకులు, గ్రామ మహిళలు, యువకులు పాల్గొన్నారు.

– దేవరకద్ర రూరల్

ప్రజల బాధలు తెలుసుకునేందుకే యాత్ర

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

అలంపూర్: రాష్ట్రంలో ప్రజల బాధలు, కష్టాలు తెలుసుకునేందుకే రాజ్యాధికార యాత్ర చేపడుతున్నామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎస్పీ చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర గత 186 రోజులుగా విజయవంతంగా కొనసాగుతుందని, ఈ యాత్రకు అపూర్వ స్పందన లభిస్తోందని చెప్పారు. ఇందులో భాగంగానే ఈ నెల 26న అలంపూర్ నియోజకవర్గంలో యాత్ర ప్రారంభిస్తానని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, మండలాల గుండా యాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజల సమస్యలను అర్థం చేసుకొని వాటి పరిష్కారానికి పోరాటం చేస్తానన్నారు. రాష్ట్రంలో గత తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్న నిరంకుశ పాలనతో విద్యార్థులు, రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. విద్యా సంవత్సరానికి సంబంధించిన రూ.8 వేల కోట్ల బడ్జెట్ అని ప్రకటించారని అది కేవలం మెగా కృష్ణారెడ్డి వంటి కంపెనీలకు అప్పగించి విద్యార్థులకు రావాల్సిన కనీస వసతులు కల్పించడం లేదని ఆరోపించారు. రైతులు, రైతు కూలీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. రాష్ట్రంలోని అలంపూర్ నియోజకవర్గం పూర్తిగా వెనకబడి ఉండగా.. సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ నియోజకవర్గాలు మాత్రం అభివృద్ధి దశలో పయనిస్తున్నాయన్నారు. తమ నియోజకవర్గాలకు ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన జోగుళాంబ ఆలయానికి నిధులు ఇస్తామని ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. రాష్ట్రంలో అధికార పార్టీ దౌర్జన్యాలు పెరిగాయని, బీఆర్ఎస్ గుండాలు ప్రతిపక్ష పార్టీల నాయకులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ప్రతిపక్ష పార్టీల సమావేశాలకు వెళ్లకుండా ప్రజలను ప్రలోభపెడుతున్నారని వాపోయారు. నడిగడ్డలో కొందరు బానిస ప్రజాప్రజాప్రతినిధులు ఉన్నారని ఎద్దేవా చేశారు. భవిష్యత్‌లో అలంపూర్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలపడానికి కృషి చేస్తానని వివరించారు. సమావేశంలో నాయకులు మహేష్, సుంకన్న, ప్రభుదాసు, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.